
సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)
శనివారం ◆ 29 ◆ జూన్ ◆ 2024



సర్దడానికి సతమతం

సీఎంఆర్ బియ్యం లారీలు తరలివస్తున్న నేపథ్యంలో నిల్వ చేయడానికి గోడౌన్లలో సరిపడా స్థలం లేక అధికారులు సతమతమవుతున్నారు. - 8లో▸



'ఖోఖో'కు అనుమతివ్వండి

వరంగల్ రీజినల్ స్పోర్ట్స్ హాస్టల్‌లో ఖోఖో, కబడ్డీ క్రీడాకారులకు అనుమతివ్వాలని వరంగల్ ఒలింపిక్స్ సంఘం బాధ్యులు.. ప్రిన్సిపల్ సెక్రటరీ వాణీప్రసాద్‌ను కోరారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
29⁰ /26⁰

వాతావరణం

ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై చల్లని వాతావరణం ఉంటుంది. జిల్లాలో అక్కడక్కడా జల్లులు కురుస్తాయి. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు తక్కువగా ఉంటాయి.

ఆశలన్నీ మీపైనే..

సీఎంగా తొలిసారి నేడు వరంగల్‌కు ఎనుముల రేవంత్ రెడ్డి



నిర్మాణంలో ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి

- హైదరాబాద్ తర్వాత అతి పెద్ద నగరం.. ప్రత్యేక పథకాలకు నిలయం
- ముఖ్యమంత్రి ముందుకు మహానగర ప్రజాశీలకు, నిధులకు మంత్రులు, ఎమ్మెల్యేల ప్రతిపాదనలు
- వరంగల్, హనుమకొండ జిల్లాల్లో సీఎం పర్యటన
- అభివృద్ధి పనుల పరిశీలన.. అధికారులతో సమీక్ష..

సాక్షిప్రతినిధి, వరంగల్/వరంగల్ అర్బన్: హైదరాబాద్ తర్వాత వరంగల్ నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయనున్నట్లు ఎన్నికల సమయంలో ప్రకటించిన ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి మొదటిసారి శనివారం ఇక్కడికి వస్తున్నారు. ఈ నేపథ్యంలో అభివృద్ధికి వరాలు కురిపిస్తారన్న ఆశలు నగరవాసులు వ్యక్తం చేస్తున్నారు. ట్రై సిటీస్‌కు విశేషాలు ఎన్నో ఉన్నా దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలు ప్రజలను వేధిస్తూ, వెక్కిరిస్తున్నాయి. పెండింగ్‌లో ఉన్న అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ సిస్టం, మాస్టర్ ప్లాన్, మురుగునీటి శుద్ధీకరణ, ఔటర్ రింగ్ రోడ్డు, ఇన్నర్ రింగ్ రోడ్డు, ప్రత్యామ్నాయ రహదారులు, నగర జంక్షన్ల సుందరీకరణ ముందుకు సాగడం లేదు. వరద నీటి నాలాల ఆధునికీకరణ, నగర సుందరీకరణ, తాగునీటి సరఫరా, సమీకృత మార్కెట్లు, వైకుంఠ ధామాలు, మౌలిక వసతులు, పర్యాటక అభివృద్ధి, మల్టీలెవల్ పార్కింగ్, బడ్జెట్ హోటల్ కీలక ప్రాజెక్టులు పూర్తి చేయాల్సి ఉంది. గ్రేటర్ వరంగల్‌కు మరో నాలుగు సర్కిల్ కార్యాలయాలు, అవసరమైన మేరకు అధికారులు, సిబ్బంది నియామకం జరగాల్సి ఉంది. ఈ నేపథ్యంలో శనివారం వరంగల్ నగరంలో పర్యటిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి పై అన్నింటిపై దృష్టి సారించి వరాలు కురిపించి, నిధులు కేటాయిస్తే వరంగల్ మహా నగరం మరింత అభివృద్ధి దిశగా పరుగులు పెట్టనుందన్న ఆశాభావాన్ని మంత్రులు, ఎమ్మెల్యేలు, నగరవాసులు వ్యక్తం చేస్తున్నారు. సీఎం పర్యటనకు అధికార యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. నగరంలో పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.



నిర్మాణంలో ఉన్న హనుమకొండలోని నయీంనగర్ నాలా బ్రిడ్జి



వరంగల్ చౌరస్తా సమీప మేదరవాడలో లింకు కలపని అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ పైపులైన్

వరంగల్‌కు వరద వేదన...

చిన్నపాటి వానకే వరంగల్ నగరం వణుకుతోంది. ప్రతీ ఏడాది కురిసిన వర్షాలతో సుమారు 45 కాలనీలు నీటమునుగుతుండటంతో పేదలు వ్యయ, ప్రయాసాలకు గురవుతున్నారు. గత రాష్ట్ర ప్రభుత్వం హనుమకొండ నయీంనగర్,వరంగల్ బొంది వాగు నాలాల విస్తరణ,ఆధునికీకరణకు నిధులు కేటాయించగా పనులు నత్తనకడన కొనసాగుతున్నాయి.

అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ సిస్టం

చిన్న పట్టణాలు, నగరాల్లో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ (యూజీడీ) సిస్టం ఉంది. వరంగల్ మహా నగరంలో మాత్రం కలగానే మిగిలింది. 1996లో రూ.1,500 కోట్లతో రూపకల్పన చేసిన ప్రతిపాదనలు 2022 నాటికి రివైజ్డ్‌గా రూ.2,400కోట్లకు పెరిగింది. ఏటేటా అంచనాలు రూ.కోట్లల్లో పెరుగుతున్నా యూజీడీకి మోక్షం లభించడం లేదు.

మల్టీలెవల్ పార్కింగ్ ఏమైంది?

హనుమకొండ అశోకా థియేటర్ ఎదురుగా ఉన్న బల్దియా స్థలంలో మల్టీలెవల్ పార్కింగ్, కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణం రెండు దశాబ్దాలుగా నానుతున్నాయి. ఈ ప్రాజెక్టును పట్టించుకునే నాథుడే కరువయ్యాడు.

స్టార్ హోటల్ ప్రతిపాదనలు మూలకు..

హనుమకొండ అంబేడ్కర్ విగ్రహం సెంటర్‌లో మున్సిపల్ అతిథి గృహం ఉంది. పాతకాలం నాటి భవనం కావడంతో కూల్చివేసి స్టార్ హోటల్ నిర్మించాలని నిర్ణయించారు. రూ.5 కోట్లతో రూపొందించిన ఈ ప్రాజెక్టు ప్రతిపాదనలు మూలకు చేరాయి.

రూపాంతరం చెందని పద్మాక్షి రోప్‌వే

చారిత్రక ఓరుగల్లుకు కలికితురాయిగా నిలువనున్న పద్మాక్షి రోప్ వే ప్రాజెక్టు ప్రతిపాదనల్లోనే మగ్గుతోంది. అడుగు కూడా ముందుకు కదలడం లేదు.

పెండింగ్‌లోనే మాస్టర్‌ప్లాన్

1972లో మాస్టర్‌ప్లాన్ అమల్లోకి వచ్చింది. ప్రతీ 15 సంవత్సరాలకొకమారు రివైజ్ చేయాలి. కానీ ఇంతవరకు కాలం చెల్లిన మాస్టర్‌ప్లాన్‌తో అక్రమ నిర్మాణాలు, అనధికారిక లేఅవుట్లతో ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. 2013లో 'కుడా'మాస్టర్‌ప్లాన్ రూపొందించి ప్రభుత్వానికి నివేదించింది. 2021 సంవత్సరంలో ఆమోదం తెలిపినట్లు అప్పటి ప్రభుత్వం ప్రకటించినా.. అది పెండింగ్‌లోనే ఉంది. దీంతో 'కుడా'పరిధిలోని ప్రజలు తీవ్ర ఇక్కట్ల పాలవుతున్నారు.

పేరుకే స్మార్ట్‌సిటీ

స్మార్ట్‌సిటీ పథకం కింద వివిధ ప్రాజెక్టుల కోసం రూ.2,278కోట్లతో డీపీఆర్‌లు రూపొందించారు. ఆశించిన స్థాయిలో ప్రాజెక్టులు ముందుకు సాగడం లేదు. ప్రభుత్వం ప్రత్యేకంగా చొరవ చూపించాలి.

విమానం ఎగరాలి..

నిజాం కాలంలో రయ్ రయ్‌మంటూ ఆకాశంలోకి ఎగిరిన విమానం.. ఇంత సాంకేతికంగా అభివృద్ధి చెందిన తరువాత మాత్రం గగనమైపోయింది. 2017లోనే ఉడాన్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం మామునూరు ఎయిర్‌పోర్టును అభివృద్ధి చేసి, విమాన సర్వీసులు నడిపేందుకు ముందుకు వచ్చింది. హైదరాబాద్ నుంచి 150 కిలోమీటర్ల దూరంలో మరో విమానాశ్రయం ఏర్పాటు చేయవద్దని శంషాబాద్ ఎయిర్‌పోర్టు నిర్వహణ సంస్థ జీఎంఆర్‌తో ప్రభుత్వాలు ఒప్పందం చేసుకున్నాయి. హైదరాబాద్ నుంచి 140కిలో మీటర్ల దూరంలో మామునూరు ఎయిర్‌పోర్టు ఉండటంతో ఆ ఒప్పందం ఆటంకంగా మారుతోంది. దీనికి తోడు ఎయిర్‌పోర్టుకు కావాల్సిన మరో సుమారు 504 ఎకరాల భూమి సేకరణ కూడా సమస్యగా మారింది. సీఎం పర్యటన నేపథ్యంలో మంత్రులు, ఎమ్మెల్యేలు వినతిపత్రం సమర్పించేందుకు సిద్ధం కాగా.. గగనయానంపై ఓరుగల్లువాసుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

పెండింగ్‌లో ఔటర్, ఇన్నర్ రింగ్ రోడ్లు...

మహానగరం చుట్టూ నాలుగు వైపులా 74కిలోమీటర్ల ఉంటుంది. కరుణాపురం నుంచి ఐనవోలు క్రాస్ రోడ్డు సింగారం వరకు 17కిలోమీటర్లు ఉంటుంది. అందుకోసం గత ప్రభుత్వంలో రూ.669.59కోట్ల అంచనా వ్యయంతో పనులకు శంకుస్థాపన చేశారు. భూ సేకరణ కోసం రూ.157.95కోట్లు కేటాయించగా, రహదారి నిర్మాణం కోసం రూ.551.64కోట్లను మంజూరీ చేసింది. నిధులు విడుదల చేయక పనులు కాలేదు. రెండవ ప్యాకేజీ కింద ఖమ్మం రోడ్డులోని(సింగారం) నుంచి ఆరెపల్లి క్రాస్ రోడ్డు వరకు 39 కిలోమీటర్లు ఎన్‌హెచ్ రూ.776.54కోట్ల కేటాయింపులు చేసింది. ఇందులో రూ.191.82 కోట్లు భూసేకరణ కోసం వ్యయం చేస్తుండగా, మిగిలిన రహదారి పనుల కోసం రూ.584.72కోట్లు వెచ్చించాలని నిర్ణయించారు. కానీ ఆ పనులు పూర్తి కాలేదు. ట్రైసిటీలో ఇన్నర్ రింగ్ రోడ్డుకు 89.36ఎకరాల ప్రైవేట్ భూమిని సేకరించాల్సి ఉంది. అందుకోసం 'కుడా' ఆర్‌డీఓ పేరిట రూ.100కోట్ల డిపాజిట్ చేసింది. రోడ్డు నిర్మాణ పనులకు ఆర్అండ్‌బీకి రూ.50కోట్ల నిధులు కేటాయించింది. కానీ, రోడ్డు అభివృద్ధికి అడుగులు పడటం లేదు.

టూర్ షెడ్యూల్..

హైదరాబాద్ శంషాబాద్ విమానాశ్రయం నుంచి హెలికాప్టర్ ద్వారా శనివారం మధ్యాహ్నం 1.30గంటలకు కాకతీయ టెక్స్‌టైల్ పార్క్‌కు చేరుకుంటారు. 1.30 గంటల నుంచి 1.50 గంటల వరకు పార్క్‌ను సందర్శిస్తారు.

- 1.50 గంటలకు టెక్స్‌టైల్ పార్క్ నుంచి బయలుదేరి రంగంపేట వద్ద నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను సందర్శిస్తారు.
- 2.30 గంటలకు హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌కు చేరుకుంటారు.
- మధ్యాహ్నం 2.45 నుంచి 3.00 గంటల మధ్య మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభిస్తారు.
- 3.00 నుంచి 5.30 గంటల వరకు గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్(జీడబ్ల్యూఎంసీ) అభివృద్ధి కార్యకలాపాలు, సమస్యలపై ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం.
- 5.40 నుంచి 6.10 గంటల వరకు హంటర్ రోడ్డులో మెడికవర్ ఆస్పత్రి ప్రారంభం
- 6.10 గంటలకు : హంటర్ రోడ్డు నుంచి బయలుదేరి 6.30 గంటలకు హనుమకొండ ఆర్ట్స్ కాలేజీ గ్రౌండ్‌కు చేరుకుంటారు.
- 6.30 గంటలకు : ఆర్ట్స్ కాలేజీ గ్రౌండ్ నుంచి హెలికాప్టర్‌లో హైదరాబాద్‌కు పయనం.

అధికారులు, ఉద్యోగులు కావలెను..

వరంగల్.. మహా నగరంగా విస్తరించింది. పెరుగుతున్న జనాభాకు సరిపడా అధికారులు, సిబ్బంది లేరు. దీంతో నగర ప్రజలు సకాలంలో సేవలు అందక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అవసరమైన మేరకు అధికారులు, సిబ్బంది నియమించి, ప్రజలకు అందుబాటులో మరో నాలుగు సర్కిల్ కార్యాలయాలను ఏర్పాటు చేయాలి. దక్షిణ తెలంగాణవాసులకు హైదరాబాద్ స్థాయిలో కార్పొరేట్ వైద్యం అందించేందుకు వరంగల్ జైలును కూల్చివేసి ఆ స్థలంలో సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం ప్రారంభించారు. కానీ, ఇంతవరకు సగం కూడా పూర్తికాలేదు. దీనిపై సీఎం సమీక్షించి పనులు వేగవంతం చేయాలని కోరుతున్నారు.

న్యూస్‌రీల్

నేటినుంచి నాలుగో సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో బీపీఈడీ నాలుగో సెమిస్టర్ పరీక్షలు(రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంట్) ఈనెల 29 నుంచి నిర్వహిస్తున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి ఎస్.నర్సింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రాధిక తెలిపారు. ఈనెల 29, జూలై 2, 4, 6వ తేదీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు.

కానిస్టేబుళ్లకు పదోన్నతి



వరంగల్ క్రైం : వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని వివిధ పోలీస్‌స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుళ్లు కుమారస్వామి, యాకాంబరం, రాంప్రసాద్, రాజేశ్‌లకు హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి కల్పిస్తూ సీపీ అంబర్ కిషోర్ ఝా ఉత్తర్వులు జారీ చేశారు. పదోన్నతి పొందిన కానిస్టేబుళ్లు శుక్రవారం సీపీని మర్యాద పూర్వకంగా కలిశారు.

నేడు డయల్ యువర్ డీఎం

హన్మకొండ: ప్రయాణికుల నుంచి సలహాలు, సూచనలు, సమస్యలు తెలుసుకోవడానికి ఈనెల 29న 'డయల్ యువర్ డీఎం' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ వరంగల్-1 డిపో మేనేజర్ వంగల మోహన్ రావు తెలిపారు. శనివారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుందని, హైదరాబాద్, కరీంనగర్, నిజామాబాద్, సిద్దిపేట, పాలకుర్తి, తరిగొప్పుల రూట్ ప్రయాణికులు 9866373825 నంబర్‌కు ఫోన్ చేసి సమస్యలు తెలపాలని, సలహాలు, సూచనలు అందించాలని ఒక ప్రకటనలో కోరారు.

పీవీ కి ఘన నివాళి



హన్మకొండ చౌరస్తా: భారతరత్న దివంగత ప్రధాని పీవీ నరసింహారావు జయంతిని పురస్కరించుకుని హనుమకొండ జేఎన్‌ఎస్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్థిక సంస్కరణలతో భారతదేశం దిశ, దశను మార్చిన గొప్ప ఆర్థిక వేత్త అని కొనియాడారు. నివాళులర్పించిన వారిలో హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్.నాగరాజు, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మున్సిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, అదనపు కలెక్టర్ రాధికాగుప్తా ఉన్నారు.

డిగ్రీ పరీక్షల్లో ఒకరి డీబార్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధి ఎస్‌డీఎల్‌సీఈ డిగ్రీ కోర్సుల బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ పరీక్షలకు శుక్రవారం 2,673 మంది విద్యార్థులకు 1952 మంది హాజరయ్యారు. నిర్మల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సెంటర్‌లో ఒకరు కాపీయింగ్ చేస్తూ పట్టుబడగా డీబార్ చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎస్.నర్సింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి ఎ.నరేందర్ తెలిపారు.

టెన్త్ సప్లిమెంటరీలో 92.96శాతం ఉత్తీర్ణత

విద్యారణ్యపురి: టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు శుక్రవారం విడుదలయ్యాయి. హనుమకొండ జిల్లా నుంచి 593 మంది విద్యార్థులు హాజరుకాగా.. 557 మంది ఉత్తీర్ణత(92.96శాతం) సాధించారని డీఈఓ ఎండీ.అబ్దుల్‌హై, ఏసీజీ చలపతిరావు తెలిపారు.

వరంగల్ జిల్లాలో..

కాళోజీ సెంటర్: పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాల్లో వరంగల్ జిల్లాలో 600 మంది ఉత్తీర్ణులయ్యారని డీఈఓ వాసంతి తెలిపారు. మొత్తం 778 మంది విద్యార్థులు పరీక్షలు రాశారని పేర్కొన్నారు.

నేడు జాబ్‌మేళా

కాళోజీ సెంటర్: ములుగు రోడ్డులోని ప్రభుత్వ ఐటీఐ క్యాంపస్‌లోని వరంగల్ జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో శనివారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఉపాధి అధికారి ఎస్.మాధవి ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్, హనుమకొండలోని ఫ్లిప్‌కార్ట్ కంపెనీలో పనిచేయడానికి అభ్యర్థులు కనీసం ఎస్సెస్సీ పాసై, 18-40 ఏళ్ల వయసు ఉండాలని, బైక్, డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి అని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు విద్యార్హతల సర్టిఫికెట్ల జిరాక్స్‌తో ఉదయం 11 గంటలకు హాజరుకావాలని సూచించారు. వివరాలకు 91770 97456 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

వైద్యసేవలపై భరోసా ఏది..?

వెంటిలేటర్ల కొరత

- శ్వాస అందక ప్రాణాలు కోల్పోతున్న రోగులు
- పనిచేయని స్కానింగ్ పరికరాలు
- మరమ్మతుకు నోచుకోని మార్చురీ ఫ్రీజర్లు
- పట్టింపులేని పాలనతో పేదల ధర్మాస్పత్రికి సుస్తీ
- ఎంజీఎంలో అడ్రస్ లేని హెచ్‌డీసీ సమావేశం



ఎంజీఎం ఆస్పత్రిలోని ఆర్ఐసీయూ విభాగం



వెంటిలేటర్ ద్వారా చికిత్స పొందుతున్న రోగి

ఎంజీఎం : ప్రభుత్వాలు మారుతున్నాయి.. పాలకులు మారుతున్నారు.. పేదల ధర్మాస్పత్రి ఎంజీఎం పరిపాలన అధికారుల తీరు మాత్రం మారడం లేదు. పరిపాలనాధికారులు నిత్యం ఆస్పత్రిలో ప్రతీ విభాగాన్ని పరిశీలిస్తూ మెరుగైన సేవలందించే దిశగా అడుగులు వేయాలి. పరిపాలన, విభాగాధిపతులు, వైద్యుల మధ్య సమన్వయం లోపంతో కొన్ని నెలలుగా ఆస్పత్రిలో పాలన గాడితప్పింది. ఏ వైద్యుడు ఎప్పుడు వస్తాడో.. ఏ వైద్యుడు ఎప్పుడు రాడో కనీసం పరిపాలనాధికారులకు కూడా తెలియని దుస్థితి నెలకొంది. అన్ని విభాగాల్లో పెద్ద ఎత్తున సమస్యలు పేరుకుపోయాయి. ఆస్పత్రి మార్చురీలోని ఫ్రీజర్లు మరమ్మతు చేయాలని ఆ విభాగాధిపతి పలుమార్లు సూపరింటెండెంట్‌కు విన్నవించినా ఫలితం లేదు. వందలాది వెంటిలేటర్లు ఆస్పత్రిలో అందుబాటులో ఉన్నా సాంకేతిక కారణాలు చెబుతూ అవి పనికి రావని చెప్పడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. రేడియాలజీ విభాగంలో స్కానింగ్ పరికరాలు మూలనపడినా పట్టింపు లేదు. రసాయనాలు లేక రక్త పరీక్షలు నిలిచినా స్పందన లేదు. ఇలా ప్రతి విభాగంలో సేవలు నిలిచిపోతూ.. ఇన్‌పేషెంట్ల సంఖ్య తగ్గుతున్నా.. గొప్పగా సేవలందిస్తున్నామని చెప్పుకోవడం విస్మయాన్ని కలిగిస్తోంది.

కృత్రిమ శ్వాసపైనే ఆధారం..

ఉత్తర తెలంగాణ జిల్లాలకు పెద్ద దిక్కుగా ఉన్న ఎంజీఎం ఆస్పత్రికి రోజూ 20 నుంచి 30 వరకు ఆత్మహత్యాయత్నం కేసులతోపాటు రోడ్డు ప్రమాదాల్లో తీవ్ర గాయాలైన వారు వచ్చి చికిత్స పొందుతారు. వీరి ఆరోగ్య పరిస్థితి విషమించిన క్రమంలో వైద్యుల సలహా మేరకు వెంటిలేటర్ చికిత్స అవసరం. 2012 సంవత్సరం నుంచి ఎంజీఎం ఆస్పత్రిలో 20 వెంటిలేటర్లు మాత్రమే అందుబాటులో ఉంటున్నాయి. కరోనా సమయంలో కృత్రిమ శ్వాస అందించడం తప్పనిసరైన నేపథ్యంలో ఆస్పత్రికి ప్రత్యేకమైన 100 వెంటిలేటర్లు వచ్చాయి. వీటిని అందుబాటులోకి తేవడంలో ఆస్పత్రి అధికారులు విఫలమవుతున్నారు. సాంకేతిక పరిజ్ఞానం కలిగిన బయోమెడికల్ టెక్నీషియన్లను నియమించి అందుబాటులోకి తేకపోవడంతో ప్రస్తుతం ఆస్పత్రిలో అధికారికంగా 20 వెంటిలేటర్లు ఉన్నాయని చెబుతున్నా.. 10 నుంచి 15 మాత్రమే వినియోగంలో ఉన్నాయి. అవసరానికి వెంటిలేటర్లు అందుబాటులోకి తేకపోవడంతో రోగుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. చాలా మంది రోగుల అటెండెంట్లు కృత్రిమ శ్వాస గంటల తరబడి అందించాల్సిన దుస్థితి ఆస్పత్రిలో నిత్యం కనిపిస్తోంది.

పనిచేయని స్కానింగ్ పరికరాలు

ఆస్పత్రిలో రోజూ 2 వేల నుంచి 3వేల వరకు ఓపీ విభాగం ద్వారా రోగులు చికిత్స పొందుతూ ఉంటారు. కడుపునొప్పి తీవ్రమైన వారికి స్కానింగ్ పరీక్షలు చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఆస్పత్రిలో మూడు పరికరాల్లో ఒకే పరికరం అందుబాటులో ఉంటుంది. వందలాది మంది రోగులకు ఒక్కటి, రెండు పరికరాలతో సక్రమంగా చికిత్స అందక ప్రైవేట్ సెంటర్లకు వెళ్లి ఆర్థికంగా నష్టపోతున్నారు.

అడ్రస్ లేని హెచ్‌డీసీ సమావేశం

ఆస్పత్రి అభివృద్ధి కమిటీ (హెచ్‌డీసీ) సమావేశం ఏళ్ల తరబడి నిర్వహించకపోవడంతో ఆస్పత్రిలో పాలన అస్తవ్యస్తంగా మారింది. హెచ్‌డీసీ కమిటీ లేకపోవడం, ఆస్పత్రి సమస్యలపై ప్రజాప్రతినిధులకు తెలియకపోవడంతో పెద్ద ఎత్తున సమస్యలు పేరుకుపోయాయి. ఫలితంగా రోగులకు శాపంగా మారింది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఆస్పత్రిలో వైద్య సేవలను మెరుగుపరచాలని రోగులు కోరుతున్నారు.

దూరవిద్య సైన్స్ కోర్సుల ఫీజు చెల్లించాలి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధి దూరవిద్యాకేంద్రం అందిస్తున్న పీజీ సైన్స్ కోర్సుల ద్వితీయ సంవత్సరం విద్యార్థులు జూలై 15 వరకు ఫీజులు చెల్లించాలని దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ఆచార్య వి.రాంచంద్రం, సైన్స్‌కోర్సుల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ బి.వెంకటగోపీనాథ్ ఒక ప్రకటనలో కోరారు. త్వరలోనే తరగతులు ప్రారంభమవుతాయని కోర్సు ఫీజుతోపాటు పరీక్ష ఫీజు కూడా చెల్లించాల్సింటుందన్నారు. ఫీజులను ఎస్‌బీఐ /యూబీఐ ద్వారా డైరెక్టర్, ఎస్‌డీఎల్‌సీఈ కాకతీయ యూనివర్సిటీ పేర వరంగల్‌లో చెల్లుబాటయ్యేలా డీడీ లేదా దూరవిద్య కేంద్రంలోని ఎస్‌బీఐ ఎక్స్‌టెన్షన్ కౌంటర్‌లో చలానా ద్వారా చెల్లించాలన్నారు. మరిన్ని వివరాలకు 0870-2461480, 2461490 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

డీఈఓ కార్యాలయం ముట్టడి ఉద్రిక్తం

ఏబీవీపీ నాయకులను లాక్కెళ్లిన పోలీసులు

విద్యారణ్యపురి: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని, ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజులను నియంత్రించాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో శుక్రవారం హనుమకొండ డీఈఓ కార్యాలయాన్ని ముట్టడించారు. విద్యార్థులు ఆందోళన చేస్తున్న విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని వారు కార్యాలయంలోకి వెళ్లకుండా బలవంతంగా లాక్కెళ్లడంతో కొంతసేపు ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. అనంతరం నాయకులను సుబేదారి పోలీస్‌స్టేషన్‌కు తరలించి తర్వాత వదిలివేసినట్లు సమాచారం. కార్యక్రమంలో ఏబీవీపీ హనుమకొండ జిల్లా కన్వీనర్ సుజిత్, నాయకులు అరుణ్, సమిత్‌రెడ్డి, భరత్, రోహిత్, సర్దార్, హరిచరణ్, శ్రీకాంత్,విష్ణు, అభిరామ్, ఠాగూర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఏబీవీపీ నాయకుడిని బలవంతంగా తీసుకెళ్తున్న పోలీసులు

వ్యవసాయ డిప్లొమా కోర్సులకు దరఖాస్తు చేసుకోవాలి

హన్మకొండ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వివిధ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. డిప్లొమా ఇన్ అగ్రికల్చర్, ఆర్గానిక్ అగ్రికల్చర్, అగ్రికల్చర్ ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశానికి జూలై 4, సాయంత్రం 5 గంటల వరకు గడువు విధించినట్లు రిజిస్ట్రార్ పి.రఘురామి రెడ్డి తెలిపారు. ఎస్సెస్సీ ఉత్తీర్ణులై టీఎస్ పాలిసెట్ పరీక్ష రాసి ర్యాంకు పొందిన వారు అర్హులని వివరించారు. ఈ కోర్సుల్లో మొత్తం 800 సీట్లు ఉండగా ఇందులో ప్రభుత్వ కళాశాలల్లో 260, ప్రైవేటు కళాశాలల్లో 540 ఉన్నాయన్నారు. 60 శాతం రూరల్ కోటాలో, 40 శాతం సీట్లు నాన్ రూరల్ కోటాలో భర్తీ చేయనున్నట్లు తెలిపారు. రూరల్ కోటాలో ప్రవేశం కోసం విద్యార్థి ఒకటి నుంచి పదో తరగతి వరకు ఏవేని నాలుగేళ్ల గ్రామీణ ప్రాంతాల్లో చదివినట్లు పాఠశాల హెచ్ఎంలు సంతకం చేసి ధ్రువీకరించిన పత్రాన్ని అప్‌లోడ్ చేయాలన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసే విధానం, పాలిటెక్నిక్ కళాశాలలు ఉన్న ప్రదేశాలు, కోర్సుల ఫీజులు, సమగ్ర సమాచారం కోసం యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో సంప్రదించాలని కోరారు.

విద్యార్థులకు పోటీలు

కాశీబుగ్గ సెంటర్: జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో 8, 9వ తరగతి చదువుతున్న విద్యార్థులకు జిల్లాస్థాయి కవితలు, పోస్టర్ తయారీ పోటీలు నిర్వహించనున్నట్లు డీఈఓ వాసంతి ఒక ప్రకటనలో తెలిపారు. 'భూమి పునరుద్ధరణ, ఎడారీకరణ, కరువును తట్టుకోవడం' శీర్షికపై కవితలు, పోస్టర్ తయారీని తెలుగు లేదా ఇంగ్లిష్‌లో రూపొందించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈ పోటీలు జూలై 2న వరంగల్‌లోని శంభునిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు http://forms.gle/h1pGpydnjnwZbXN57 లో రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు జిల్లా సైన్స్ అధికారి, జిల్లా ఎన్జీసీ కోఆర్డినేటర్ డాక్టర్ కట్ల శ్రీనివాస్ (9848878455)ను సంప్రదించాలని తెలిపారు.

ఫ్యాన్ మీద పడి విద్యార్థినికి గాయాలు


సంధ్యను పరామర్శిస్తున్న రిజిస్ట్రార్ మల్లారెడ్డి, పక్కన హాస్టళ్లడైరెక్టర్ రాజ్‌కుమార్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని పోతన మహిళా హాస్టల్‌లో ఓ గదిలో ఫ్యాన్ మీదపడి విద్యార్థిని సంధ్యకు గాయాలయ్యాయి. ఈ ఘటన గురువారం రాత్రి జరిగింది. వెంటనే ఆ విద్యార్థిని బంధువు ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. శుక్రవారం రిజిస్ట్రార్ మల్లారెడ్డి, హాస్టళ్ల డైరెక్టర్ రాజ్‌కుమార్ విద్యార్థినిని పరామర్శించారు. చికిత్స అనంతరం సంధ్యను డిశ్చార్జ్ చేశారు. కాగా, సంధ్య ఎంఏ పొలిటికల్ సైన్స్ మొదటి సంవత్సరం రెండో సెమిస్టర్ చదువుతోంది. ఈ ఘటనపై విద్యార్థి సంఘాల బాధ్యులు పరిపాలనభవనం వద్ద ఆందోళన చేశారు. దీంతో రిజిస్ట్రార్ మల్లారెడ్డి, హాస్టళ్ల డైరెక్టర్ రాజ్‌కుమార్, పరీక్షల నియంత్రణాధికారి నర్సింహాచారి పోతనహాస్టల్‌కు వెళ్లి పరిశీలించారు. హాస్టల్‌లో మరమ్మతులు చేపట్టేందుకు నిర్ణయించామని రిజిస్ట్రార్ మల్లారెడ్డి శుక్రవారం రాత్రి తెలిపారు.

సర్దడానికి సతమతం


కాజీపేట ఎఫ్‌సీఐ ప్రధాన గేట్


బియ్యం నిల్వలతో కళకళలాడుతున్న గోడౌన్లు

బియ్యం నిల్వలతో నిండిన ఎఫ్‌సీఐ గోదాంలు
- ప్రత్యేక రేకుల కోసం అధికారుల వినతి
- ప్రైవేట్ గోడౌన్ల లీజుకు ప్రయత్నాలు

కాజీపేట: కాజీపేట భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) గోడౌన్లలో బియ్యం నిల్వలు క్రమేపీ పెరిగిపోతున్నాయి. నిర్దేశించిన లక్ష్యం మేరకు గూడ్స్ రైళ్లు(రేకులు) రాకపోవడంతో, మిల్లర్ల నుంచి సీఎంఆర్ వస్తుండడంతో గోడౌన్లు భర్తీ అవుతున్నాయి. జిల్లా నుంచి సీఎంఆర్ బియ్యం లారీలు తరలివస్తున్న నేపథ్యంలో.. నిల్వ చేయడానికి గోడౌన్లలో సరిపడా స్థలం లేక సర్దడానికి అధికారులు సతమతమవుతున్నారు. బియ్యం లారీలను సంబంధిత అధికారులు సకాలంలో లోపలికి అనుమతించకపోవడంతో లారీలు రహదారుల వెంట, ఎఫ్‌సీఐ రహదారిలో నిలిచి ఉంటున్నాయి. గతేడాది కాలంగా బియ్యం అంతంత మాత్రంగానే.. ఇతర రాష్ట్రాలకు తరలిపోవడంతో కొత్తగా వచ్చే బియ్యం బస్తాల్ని నిల్వ చేయడం కష్టంగా మారింది. ఇది ఒక కాజీపేట ఎఫ్‌సీఐ గోడౌన్ పరిస్థితే కాదు. వరంగల్, నెక్కొండ, యశ్వంతపూర్‌లోనూ ఇదే పరిస్థితి.

ఉమ్మడి జిల్లాలో గోడౌన్లలో నిల్వలు (మెట్రిక్ టన్నుల్లో)

గోడౌన్లు	సామర్థ్యం	నిల్వలు
కాజీపేట	1,10,000	90,000
ఏనుమాముల టీజీ ఎస్‌డబ్ల్యూసీ	15,000	5,000
ఏనుమాముల సీడబ్ల్యూసీ	5,000	5,000
నెక్కొండ	1,00,000	50,000
గొర్రెకుంట	20,000	20,000
రఘునాథపల్లి	30,000	25,000

రేకులు కేటాయించాలని వినతి

ఇతర రాష్ట్రాలకు బియ్యం నిల్వలను తరలించడానికి అవసరమైన గూడ్స్ రైళ్లను కేటాయించాలని ఎఫ్‌సీఐ అధికారులు కేంద్ర ప్రభుత్వంతో పాటు రైల్వే అధికారులకు విన్నవిస్తున్నా.. ఫలితం శూన్యమే అవుతోంది. అతి కష్టం మీద మే నెలలో రెండు గూడ్స్ రైళ్లు మాత్రమే రావడంతో బియ్యం నిల్వలను ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేశారు. దీంతో కొంతమేర గోడౌన్లలో ఖాళీ స్థలం ఏర్పడింది. దేశ వ్యాప్తంగా నీటి లభ్యత పెరగడంతో వరి పంటల సాగు సమృద్ధిగా పెరుగుతోంది. స్థానికంగానే దొడ్డు రకం బియ్యం లభిస్తుండడంతో దిగుమతి చేసుకోవాల్సిన అవసరం తప్పింది. కేంద్ర ప్రభుత్వం ఇటీవలి నిబంధనలను కాస్త సడలించడంతో ఇప్పుడిప్పుడే బియ్యం బయటి ప్రాంతాలకు ఎగుమతి చేసే పరిస్థితులు నెలకొన్నాయి. రైల్వే అధికారులు జూన్‌లో అయిదు గూడ్స్ రైళ్లను కేటాయిస్తే తప్ప బియ్యం నిల్వలు బయటి ప్రాంతాలకు తరలిపోయే పోవడంతోపాటు గోడౌన్లలో ఖాళీ స్థలం ఏర్పడే పరిస్థితి లేదని ఎఫ్‌సీఐ అధికారులు భావిస్తున్నారు.

అద్దె గోడౌన్ల కోసం వెదుకులాట

బియ్యం నిల్వలు గోడౌన్లలో పేరుకుపోవడం కారణంగా ఏం పాలుపోని స్థితిలో అధికారులున్నారు. అద్దె గోడౌన్ల కోసం వెదుకులాట ప్రారంభించారు. రఘునాథపల్లి, వడ్లకొండ, ఏనుమాముల, నెక్కొండ ప్రాంతాల్లోని ప్రైవేట్ గోడౌన్లను పరిశీలించారు. బియ్యం నిల్వ చేయడానికి, తరలించడానికి అనుకూలంగా ఉండే ప్రాంతాలను ఎంపిక చేయడానికి అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు.

ఆదర్శప్రాయుడు పీవీ

- మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్


పీవీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్

ఎల్కతుర్తి: దివంగత మాజీ ప్రధాని, భారతరత్న పీవీ నరసింహారావు ఆదర్శప్రాయుడని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నారు. పీవీ 103వ జయంతి సందర్భంగా శుక్రవారం భీమదేవరపల్లి మండలం వంగర గ్రామంలో ఫైనాన్స్ కమిషన్ చైర్మన్, మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నతో కలిసి పీవీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పీవీ గృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి ప్రభాకర్ గౌడ్ మాట్లాడుతూ పీవీ నరసింహారావు భూ సంస్కరణల చట్టం తీసుకొచ్చి ఎంతో మంది నిరుపేదలకు తన భూములన్నింటిని దానం చేసిన మహనీయుడు అని కొనియాడారు. పీవీ నరసింహారావు జీవిత చరిత్ర అందరికీ మార్గదర్శకమన్నారు. పీవీ నరసింహారావు దగ్గర ఇందిరాగాంధీ సలహాలు తీసుకుని వాటిని పాటించేవారని గుర్తు చేశారు. నాడే నవోదయ, కేంద్రీయ విద్యాలయాలు, భూసంస్కరణలు, విదేశాంగ విధానం, ఆర్థిక సంస్కరణలు తీసుకొచ్చిన మహనుబావుడు పీవీ నరసింహారావు అని కొనియాడారు. హుస్నాబాద్ నియోజకవర్గం పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందన్నారు. భవిష్యత్‌లో హుస్నాబాద్ శాసన సభ సభ్యుడిగా తన నియోజక వర్గ ప్రజల గౌరవం పెంచనున్నట్లు స్పష్టం చేశారు. పీవీ నరసింహారావు ఆలోచన విధానాన్ని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం సిరిసిల్ల రాజయ్య మాట్లాడారు. దేశానికే గొప్ప నాయకత్వం అందించి పాలనలో చెరగని ముద్రవేసిన నేత పీవీ నరసింహారావు అని కొనియాడారు. అష్టభాష కోవిదుడు మన పీవీని భారతరత్న వరించడం గర్వకారణమన్నారు. తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తనపై అక్రమ కేసులు మోపి జైలుకు పంపడం వల్లే తాను పీవీ నరసింహారావు జీవిత చరిత్ర పుస్తకాన్ని చదువగలిగానని చెప్పారు. కేసీఆర్‌కు మరోసారి కృతజ్ఞతలు తెలుపుకోవాలని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో కర్నకంటి మంజులారెడ్డి, ఆర్డీఓ ఎస్.వెంకటేష్, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంపీడీఓ వీరేశం, ఏసీపీ తిరుమల్, సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్సైలు సాయిబాబు, నీలోజు వెంకటేశ్వర్లు, రాజ్‌కుమార్ ఆర్.వెంకట్‌రెడ్డి, కావ్యలక్ష్మారెడ్డి, వెంకట్‌నారాయణ, నాయకులు చిట్టంపల్లి అయిలయ్య, గోపిశర్మ, ఊసకోయిల ప్రకాశ్, ఆదరి రవి, కొలుగూరి రాజు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ అభివృద్ధికి కేంద్రం నిధులు విడుదల చేయాలి

కేంద్రంలో మూడోసారి అధికారం చేపట్టిన మోదీ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి నిధులు విడుదల చేయాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. శుక్రవారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నతో కలిసి మంత్రి మాట్లాడారు. పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో తెలంగాణ నుంచి ఎన్నికైన ఎంపీలు రాష్ట్ర విభజన హామీలను వెంటనే అమలు చేసేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని పిలుపునిచ్చారు. విభజన హామీలకోసం తెలంగాణ బీజేపీ ఎంపీలు కేంద్రంపై ఒత్తిడి తెస్తే కాంగ్రెస్ ఎంపీలు సహకరిస్తారన్నారు.

రూ.30.38 కోట్ల ధాన్యం మాయం

- సీఎంఆర్ అందించకుండా మిల్లర్ల నిర్వాకం
- సివిల్ సప్లై టాస్క్‌ఫోర్స్ అధికారుల తనిఖీల్లో వెలుగులోకి..
- కేసముద్రంలో ఘటన


కేసముద్రం విలేజీలో ఓ రైస్ మిల్లులో తనిఖీ చేస్తున్న సివిల్ సప్లై టాస్క్‌ఫోర్స్ అధికారులు

కేసముద్రం: మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండల కేంద్రంలో పలు రైస్ మిల్లులపై సివిల్ సప్లై టాస్క్‌ఫోర్స్ (హైదరాబాద్), జిల్లా సివిల్ సప్లై అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఇందులో మూడు రైస్ మిల్లుల్లో రూ.30.38 కోట్ల విలువైన 11 వేలకు పైగా మెట్రిక్ టన్నుల ధాన్యం మాయమైనట్లు గుర్తించారు. సివిల్ సప్లై డీఎం కృష్ణవేణి, డీఎస్ఓ రాజేందర్ కథనం ప్రకారం.. సీఎంఆర్ కింద ప్రభుత్వానికి అందించాల్సిన ధాన్యం మాయం చేసినట్లు విశ్వసనీయ సమాచారం మేరకు ఆయా మిల్లుల్లో అధికారులు వరుసగా దాడులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం కేసముద్రం విలేజ్‌లోని మహదేవ రైస్ మిల్లులో రూ.12.79 కోట్ల విలువైన 5,087 మెట్రిక్ టన్నులు, మణికంఠ మిల్లులో రూ.3.79కోట్ల విలువైన 1236.26 మెట్రిక్ టన్నుల ధాన్యం మాయమైనట్లు గుర్తించారు. కాగా, ఇటీవల మారుతి రైస్ ఇండస్ట్రీస్‌లో నిర్వహించిన తనిఖీల్లోనూ రూ.13.80కోట్ల విలువైన 4336.44 మెట్రిక్ టన్నుల ధాన్యం మాయమైనట్లు గుర్తించారు. ఈ మేరకు ఆయా మిల్లర్లపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. మొత్తానికి సీఎంఆర్ కింద ప్రభుత్వం మిల్లులకు కేటాయించిన ధాన్యం పెద్దమొత్తంలో మిల్లర్లు మాయం చేసిన విషయం సివిల్ సప్లై టాస్క్‌ఫోర్స్ అధికారుల తనిఖీల్లో వెలుగులోకి రావడం సంచలనం సృష్టించింది. కార్యక్రమంలో సివిల్ సప్లై టాస్క్‌ఫోర్స్ అధికారులు, తహసీల్దార్ దామోదర్, సెకండ్ ఎస్సై రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

టీజీ ఎన్పీడీసీఎల్‌లో డాష్ బోర్డు అప్లికేషన్

- సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి



హన్మకొండ: డిస్కంకు సంబంధించిన ప్రతి సమాచారాన్ని చూసేందుకు డాష్ బోర్డు అప్లికేషన్‌ను ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఫ్లూయెంట్ గ్రిడ్ కంపెనీ వారు యుటిలిటీ ఆపరేషన్ సెంటర్‌పై హనుమకొండలోని టీజీఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో సీఎండీ వరుణ్ రెడ్డి, డైరెక్టర్లు.. నూతన సాంకేతిక పద్ధతులు, వాటితో కలిగే ప్రయోజనాలపై చర్చించారు. ఈ సందర్భంగా సీఎండీ వరుణ్ రెడ్డి మాట్లాడుతూ డాష్ బోర్డు అప్లికేషన్ ద్వారా వర్క్ ఫోర్స్ మేనేజ్‌మెంట్, ఔటేజ్ మేనేజ్‌మెంట్ సిస్టం, డిమాండ్ సైడ్ మేనేజ్‌మెంట్, వినియోగదారుల పోర్టల్, సిటిజన్ మేనేజ్‌మెంట్, మీటర్ డాటా మేనేజ్‌మెంట్, అస్సెట్ మేనేజ్‌మెంట్ వంటి సమగ్ర వివరాలు తెలుసుకునే వీలుంటుందన్నారు. బిల్లింగ్, కలెక్షన్, అంతరాయాలు, ఫిర్యాదుల వివరాలు కమాండ్ కంట్రోల్‌లా ఒకేచోట పూర్తి సమాచారం తెలుసుకునే వీలుంటుందన్నారు. ఎక్కడ ఏమీ జరిగినా ఆ సమాచారం ఇందులో తెలుసుకునే సదుపాయం ఉంటుందన్నారు. చాట్ బాట్, ఇంటరాక్టీవ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టం వినియోగదారులకు అందుబాటులోకి తీసుకొస్తున్నామని, తద్వారా వారి సమస్యలు త్వరితగతిన పరిష్కారమవుతాయన్నారు. కాలానికి అనుగుణంగా అవసరమైన సాంకేతికతను అందిపుచ్చుకోవడానికి ముందుంటామన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డైరెక్టర్లు డైరెక్టర్లు బి.అశోక్ కుమార్, టి.సదర్ లాల్, వి.మోహన్ రావు, వి.తిరుపతి రెడ్డి, సీజీఎంలు కె.తిరుమల్ రావు, టి.మధుసూదన్, కె.కిషన్, రాజుచౌహాన్, కె.ఎస్.గుట్ట, జీఎంలు అన్నపూర్ణ, శ్రీనివాస్, డీఈ ఐటీ కే.అనిల్ కుమార్ పాల్గొన్నారు.

శిశు గృహకు నవజాత శిశువు అప్పగింత

- 54 రోజులు ఎంజీఎంలో చికిత్స


నవజాత శిశువును అప్పగిస్తున్న ఎంజీఎం వైద్యులు

కాజీపేట అర్బన్ : ఎంజీఎం వైద్యులు శుక్రవారం శిశు గృహకు నవజాత ఆడ శిశువును అప్పగించారు. స్త్రీ, శిశు సంక్షేమాధికారి మధురిమ కథనం ప్రకారం.. దామెర మండలం ఊరుగొండ గ్రామ సమీపంలోని పొలాల వద్ద అప్పుడే జన్మించిన శిశువును వదిలేశారు. అటుగా వెళ్తున్న లారీ డ్రైవర్ గమనించి స్థానికులు, పోలీసులకు సమాచారం అందజేశాడు. దీంతో దామెర ఎస్సై.. నవజాత శిశువును కాపాడి స్థానిక ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం ఎంజీఎంలో చేర్పించారు. 54 రోజులు ఎంజీఎంలో చికిత్స అందజేసి పూర్తిగా కోలుకున్న తర్వాత నవజాత శిశువును ఎంజీఎం సూపరింటెండెంట్ వలుపదాసు చంద్రశేఖర్, పీడియాట్రిషన్ హెచ్ఓడీ సుధాకర్.. చైల్డ్‌లైన్ సిబ్బంది ఆధ్వర్యంలో శిశు గృహకు అప్పగించారు. ఆడపిల్లలు వద్దు అనుకునే తల్లిదండ్రులు నేరుగా శిశుగృహకు నవజాత శిశువులను అప్పగించాలని మధురిమ కోరారు. కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ ఇన్‌చార్జ్ అధికారి ఎస్.ప్రవీణ్‌కుమార్, శిశు గృహ మేనేజర్ దూడం నగేశ్, సంగి చైతన్య,విజయ్‌కుమార్, రజిత తదితరులు పాల్గొన్నారు.

'ఖోఖో'కు అనుమతి ఇవ్వండి

- 'సాట్' ప్రిన్సిపల్ సెక్రటరీ వాణీప్రసాద్‌కు వినతి


వాణీప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఒలింపిక్స్ సంఘం బాధ్యులు, హనుమకొండ, వరంగల్ డీవైఎస్ఓలు అశోక్, సత్యవాణి

వరంగల్ స్పోర్ట్స్: వరంగల్ రీజనల్ స్పోర్ట్స్ హాస్టల్‌లో ఖోఖో, కబడ్డీ క్రీడాకారులకు అనుమతి ఇవ్వాలని వరంగల్ ఒలింపిక్స్ సంఘం కార్యదర్శి కైలాస్‌యాదవ్, కోశాధికారి శ్యాంప్రసాద్.. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ప్రిన్సిపల్ సెక్రటరీ వాణీప్రసాద్‌ను కోరారు. అధికారిక కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జిల్లాకు విచ్చేసిన ప్రిన్సిపల్ సెక్రటరీ వాణీప్రసాద్ హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా స్టేడియంలో నిర్వహిస్తున్న హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్ స్పోర్ట్స్ స్కూళ్లలో ప్రవేశాలకు ఎంపికల ప్రక్రియను ప్రారంభించారు. క్రీడాకారుల ఎంపిక పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఒలింపిక్స్ సంఘం ఆధ్వర్యంలో స్టేడియంలో క్రీడా పోటీలు వీక్షించేందుకు గ్యాలరీ, ఇతర వసతులు కల్పించాలని వాణీప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. కాగా, ఇదివరకు ఉన్న హాస్టల్ భవనం శిథిలావస్థకు చేరడంతో స్టేడియంలోని వేరే భవనంలో నిర్వహిస్తున్నామని, బాలబాలికలకు వేర్వేరుగా హాస్టల్ భవన నిర్మాణం కోసం నిధులు కేటాయించాలని హనుమకొండ డీవైఎస్ఓ అశోక్.. ప్రిన్సిపల్ సెక్రటరీ వాణీప్రసాద్‌ను కోరారు. అలాగే, రెండు సంవత్సరాల క్రితం ఏర్పడిన వరంగల్ డీఎస్ఏకు ఆదాయ వనరులు లేవని, నిధులు లేమితో క్రీడాకారులకు సరైన వసతులు కల్పించలేకపోతున్నామని వరంగల్ డీవైఎస్ఓ సత్యవాణి తెలిపారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ప్రిన్సిపల్ సెక్రటరీ వాణీప్రసాద్.. ఉమ్మడి వరంగల్ క్రీడాభివృద్ధికి కావాల్సిన వసతులు, నిధులు గురించి సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా కల్పించారు.

ఇంటర్ ప్రిటేషన్ పనులు త్వరగా పూర్తి చేయాలి

వెంకటాపురం(ఎం): రామప్ప ఆలయ పరిసర ప్రాంతంలో ప్రసాద్ ప్రాజెక్టు పథకంలో నిర్మిస్తున్న ఇంటర్ ప్రిటేషన్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని టూరిజం ప్రిన్సిపాల్ సెక్రటరీ వాణీప్రసాద్, టూరిజం కార్పొరేషన్ ఎండీ న్యాలకొండ ప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఇంటర్ ప్రిటేషన్ నిర్మాణ పనులను పరిశీలించి నాణ్యతతో చేపట్టాలని సూచించారు. అనంతరం రామప్ప దేవాలయాన్ని సందర్శించి స్వామివారికి పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు హరీశ్‌శర్మ, ఉమాశంకర్.. వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో టూరిజం అధికారులు నాథన్, సరిత, శివాజీ, ఏఈ విజయ్‌కుమార్ ఉన్నారు.

జిల్లాలో క్రీడల అభివృద్ధికి కృషిచేయాలి

కాశిబుగ్గ: వరంగల్ జిల్లాలో క్రీడల అభివృద్ధికి కృషి చేయాలని జిల్లా యువజన క్రీడల అధికారి (డీవైఎస్ఓ) సత్యవాణి కోరారు. ఈ మేరకు శుక్రవారం సాట్ (స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ) ప్రిన్సిపల్ సెక్రటరీ వాణీప్రసాద్‌ను హనుమకొండ జేఎన్ఎస్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూలబొకే అందజేసి క్రీడలు, స్టేడియాల సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ఆమె స్పందించి జిల్లాలో క్రీడల అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. అలాగే, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీలో 31 సంవత్సరాలుగా పనిచేస్తున్న కోచ్‌ల సమస్యలు కూడా పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు.

5 నుంచి పీజీ సెకండియర్ రెండో సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాలో పీజీ ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ ఎంటీఎం, ఎంఎస్‌డబ్ల్యూ తదితర కోర్సుల రెండో సంవత్సరం రెండో సెమిస్టర్ పరీక్షలు (రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంట్) జూలై 5వ తేదీనుంచి నిర్వహించనున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఎస్.నర్సింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి బీఎస్ఎల్ సౌజన్యజీ శుక్రవారం తెలిపారు. ఈ పీజీ కోర్సుల పరీక్షలు జూలై 1వ తేదీ నుంచి నిర్వహించాల్సిండగా కొందరు విద్యార్థుల విజ్ఞప్తి మేరకు ఆ పరీక్షలను వాయిదావేసి జూలై 5వ తేదీనుంచి నిర్వహించనున్నామని వారు తెలిపారు. జూలై 5, 8, 10, 12, 15, 18 తేదీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్షలు జరుగుతాయని వారు తెలిపారు.

మెరుగైన రోడ్ల నిర్మాణమే లక్ష్యం


ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ఇంజనీర్లు

కాజీపేట అర్బన్ : మెరుగైన రోడ్ల నిర్మాణమే లక్ష్యంగా భారత గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఆధునిక మెళకువలపై అవగాహన కల్పిస్తున్నట్లు సివిల్ డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ సీఎస్ఆర్‌కె.ప్రసాద్ అన్నారు. నిట్ వరంగల్‌లోని సెమినార్ హాల్ కాంప్లెక్స్‌లో 'పేవ్‌మెంట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ఫర్ రూరల్ రోడ్స్ అనే అంశంపై' నేషనల్ రూరల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ సౌజన్యంతో నిర్వహిస్తున్న ఐదు రోజుల ఎగ్జిక్యూటివ్ డెవలప్‌మెంట్(ఈడీ) ప్రోగ్రాం శుక్రవారం ముగిసింది. ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన పథకంలోని 45 మంది ఇంజనీర్లు హాజరయ్యారు. కార్యక్రమంలో నిట్ ప్రొఫెసర్లు వెంకయ్య, శంకర్, వివిధ సంస్థల ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

1న వరంగల్ జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు

వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జూలై 1న వరంగల్ జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మూగల కుమార్‌యాదవ్, ఊర యుగేంధర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు జూలై 7వ తేదీన హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో జరగనున్న రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. అండర్-8 విభాగంలో 8 జూలై 2016 నుంచి 7 జూలై 2018 మధ్య జన్మించి ఉండాలని, అండర్-10 బాలబాలికల విభాగంలో 8 జూలై 2014 నుంచి 7 జూలై 2016 మధ్య జన్మించిన వారై ఉండాలి. అండర్-12 బాలబాలికల విభాగంలో 8 జూలై 2012 నుంచి 7 జూలై 2014 మధ జన్మించిన వారు అర్హులుగా పేర్కొన్నారు. అండర్-8 బాలబాలికలకు 50, 300 మీటర్ల పరుగు, స్టాండింగ్ బ్రాడ్‌జంప్, అండర్-10 బాలబాలికల విభాగంలో 100, 300 మీటర్ల పరుగు, లాంగ్‌జంప్, అండర్-12 బాలబాలికలకు 100, 400, 600 మీటర్ల పరుగు, లాంగ్‌జంప్ కేటగిరీల్లో ఎంపికలు ఉంటాయని తెలిపారు. క్రీడాకారులు ఉదయం 8గంటలకు జనన ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని సూచించారు. వివరాలకు యుగేంధర్‌రెడ్డి (98665 64422)ని సంప్రదించాలని పేర్కొన్నారు.

స్పోర్ట్స్ స్కూళ్లలో ప్రవేశాలకు ఎంపికలు



కాశిబుగ్గ: రాష్ట్రంలోని హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్ స్పోర్ట్స్ స్కూళ్లలో నాలుగో తరగతిలో ప్రవేశాలకు జిల్లాస్థాయి ఎంపికలు రెండో రోజు మంగళవారం వరంగల్ ఓ సిటీ స్టేడియంలో కొనసాగాయి. దుగ్గొండి, పర్వతగిరి, రాయపర్తి, నల్లబెల్లి మండలాల నుంచి 24 మంది విద్యార్థులు (11 మంది బాలికలు, 13 మంది బాలురు) ఎంపికలకు హాజరయ్యారని జిల్లా యువజన, క్రీడల అధికారి సత్యవాణి తెలిపారు. వచ్చిన వారి సర్టిఫికెట్లను పరిశీలించి, పలురకాల పోటీలు నిర్వహించినట్లు ఆమె పేర్కొన్నారు. శనివారం కూడా మిగిలిన మండలాల వారికి ఎంపికల పోటీలు కొనసాగుతాయని తెలిపారు. ఎంపికల్లో స్పోర్ట్స్ సిబ్బంది, కోచ్‌లు పాల్గొన్నారు.